ప్రజాశక్తి
బుధవారం 2 జులై 2025
5
శ్రీ సత్యసాయి





సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

జాతీయ రహదారుల పనులను
వేగవంతం చేయండి

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ పనులను త్వరగతిన పూర్తి చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలసి ఎన్‌హెచ్ 342, ఎన్‌హెచ్ 716 జి, ఎన్‌హెచ్ 544జి, జాతీయ రహదారుల భూ సేకరణపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను అన్ని రంగాల్లో అభివద్ధి చేసే ప్రక్రియలో భాగంగా రహదారులను విస్తత పరిచి రవాణా రంగాన్ని సులభతరం చేయడానికి చేపట్టడం జరుగుతోందన్నారు. భూ సేకరణ పనులు వేగవంతం చేయాలని ఆయా డివిజన్లో ఆర్డీవోలు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. 346 ప్యాకేజీ కింద బుక్కపట్నం మండలం బుచ్చయ్యగారిపల్లి, ముదిగుబ్బ మండలం దొరిగల్లు, పనులు సమీక్షించారు. పుట్టపర్తి మండలం అమకొండ పాలెం ప్రజలకు సంబంధించి పెండింగ్ బిల్లులపై సమీక్షించి సత్వరమే పూర్తిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఏమైనా సమస్యలు ఉంటే జాతీయ రహదారుల అథారిటీ వారు సంబంధిత రెవెన్యూ ఆర్డీవోలు తహశీల్దార్లు సమన్వయం చేసుకుంటూ పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి, కదిరి, ధర్మవరం ఆర్డీవోలు సువర్ణ, వివిఎస్.శర్మ, మహేష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటసుబ్బయ్య, పిడిపి అశోక్ కుమార్, ముత్యాలరావు, డిఈ గిడ్డయ్య, ఆర్అండ్‌బి డిఈ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆనాడు రూల్ ఆఫ్ లా ఏమైంది.?

◆నాకు పెద్దారెడ్డే సమస్య
◆ఇతర వైసిపి నాయకులతో నాకు మంచి సంబంధాలు
◆తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



విలేకరులతో మాట్లాడుతున్న జెసి.ప్రభాకర్‌రెడ్డి

వైసిపి అధికారంలో ఉన్న ఐదేళ్లలో రూల్ ఆఫ్ లా ఏమైందని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. తమపై ఎటువంటి కేసులు నమోదు చేసి ఇబ్బందులు పెట్టారో గుర్తుకు లేవా అని మండిపడ్డారు. అనంతపురం నగరంలోని ఆయన నివాసంలో మంగళవారం నాడు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి గడిచిన ఐదేళ్లలో నిబంధనలకు విరుద్ధంగా భూములు రిజిస్ట్రేషన్ చేసుకోలేదా అని ప్రశ్నించారు. కేతిరెడ్డి కాలనీలో భార్య పేరు మీద రిజిస్ట్రేషను చేసుకున్నారని, వాటిని ఆధారాలతో సహా అప్పటి కలెక్టర్ నాగలక్ష్మికి ఇస్తే ఎటువంటి చర్యలూ తీసుకోలేదని తెలిపారు. ఆయన ఇళ్లు కూడా నిబంధనలకు విరుద్ధంగానే నిర్మాణం జరిగిందన్నారు. వంద ఎకరాలకుపైగా గాలిమరలకు కేటాయించిన భూములకు ఏ రకంగా పాసుపుస్తకాలు తీసుకున్నారో చెప్పాలన్నారు. ఒక్కసారి కన్వర్షన్ అయిన తరువాత ఆ భూమి సాగు భూమిగా ఉండదన్న విషయం తెలియదా అని ప్రశ్నించారు. వాటిపై చర్యలు తీసుకుంటామని చెబితే తానేదో ఇబ్బంది పెడుతున్నట్టు చెబుతున్నారన్నారు. గతంలో తమ అనుయాయుడు రవీంద్రారెడ్డికి కూడా కోర్టు అనుమతిచ్చినా తాడిపత్రిలోకి రానిచ్చారా అని ప్రశ్నించారు. ఇప్పుడేమో పెద్దారెడ్డిని రానివ్వకపోవడం అన్యాయం అని చెబుతున్న వైసిపి నేతలకు ఇవి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో తనపై నిబంధనల ప్రకారమే కేసులు పెట్టారా అని నిలదీశారు. అశోక్ లైల్యాండ్ వాహనాల కొనుగోలు విషయంలో తనపై కేసులు పెట్టారు...కాని వాటిని అమ్మిన హిందూజా సంస్థ పేరు కూడా కేసులో ఎందుకు లేదో చెప్పాలన్నారు. మోటర్ వెహికల్ యాక్టులో ఏముందో చెప్పాలని నిలదీశారు. తనకు ఇతర వైసిపి నాయకులపై ఎటువంటి కోపం లేదని, కేవలం కేతిరెడ్డి పెద్దారెడ్డిపై మాత్రమే ఉందన్నారు. ఆయన గత ఐదేళ్లలో చేసిన వ్యవహారాలపైనే తాను చర్యలు తీసుకోవాలని అడుగుతున్నట్లు చెప్పారు. ఆయనకు మద్దతుగా వస్తున్న వైసిని నాయకులు ఈ విషయాలను గ్రహించాలని తెలిపారు.

జాకీ భూములు వెనక్కి..!

◆కేటాయింపులు రద్దు చేస్తూ ఉత్తర్వులు ◆ఆది నుంచి దీనిపై వివాదమే..

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి





జాకీ (పేజ్ ఇండస్ట్రీస్)కు కేటాయించిన భూములను వెనక్కు తీసుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నాడు ఉత్తర్వులు జారీ చేసింది. జాకీ పరిశ్రమ ఏర్పాటవకపోవడంపై గతంలో పెద్దఎత్తున రాజకీయ దుమారం రేగింది. అప్పటి వైసిపి నాయకుల వల్లే ఈ పరిశ్రమ వెనక్కు వెళ్లడానికి కారణంటూ ప్రతిపక్షంలో ఉండగా టిడిపి విమర్శలు చేసింది. వారి హయాంలోనే రాకుండా పోయాయని వైసిపి కూడా ప్రత్యారోపణలు చేస్తూ వచ్చింది. మొత్తంగా సంస్థ ఇక్కడ పరిశ్రమ ఏర్పాటుకు పనులు ప్రారంభించి మధ్యలోనే ఆపేసి వెళ్లిపోయింది. ఈ నిర్ణయంతో అనంత పురం నగరం, రాప్తాడు మధ్య రావాల్సిన జాకీ గార్మెంట్ పరిశ్రమ ఏర్పాటవ కుండానే వెళ్లిపోయినట్టయింది.

'జాకీ' కథ ఇది

అనంతపురం జిల్లాలో 'జాకీ' పేజ్ ఇండస్ట్రీస్ సంస్థ తమ ఉత్పత్తులను తయారు చేసుకోవడానికి పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చింది. వారి అభ్యర్థన మేరకు రాష్ట్ర ప్రభుత్వం 2018 జూన్ 21వ తేదీన అనంతపురం, రాప్తాడు మధ్యలో జాతీయ రహదారి 44కు అనుకుని 30 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎపిఐఐసి ద్వారా పేజ్ ఇండస్ట్రీస్‌కు కేటాయించింది. ఆ సంస్థ పనులు ప్రారంభిస్తున్న సమయంలోనే ఎన్నికలు రావడం 2019లో వైసిపి అధికారంలోకి వచ్చిన ఆ తరుణంలో నేతల ఒత్తిడి మేరకు ఆ సంస్థ పనులను నిలిపివేసినట్టు ఆరోపణలున్నాయి. ఈ మేరకు ఆ సంస్థ 2019 డిసెంబర్‌లో ఆ సంస్థ ఇక్కడ తాము వివిధ కారణాల రిత్యా పరిశ్రమను ఏర్పాటు చేయలేమని ఎపిఐఐసి లేఖ రాసింది. కావున ఈ భూమిని సరెండర్ చేయడానికి సిద్ధంగానున్నట్టు అందులో పేర్కొంది. అనంతరం ఆ పరిశ్రమ తెలంగాణలో ఏర్పాటు చేసింది. అప్పటి నుంచి భూమిని రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకోలేదు. ఇప్పుడు ఆ భూమిని ఇతర పారిశ్రామిక అవసరాల కోసమంటూ స్వాధీనం చేసుకుంటూ ఉత్తర్వులు జారీ చేశారు.

రేమండ్స్ ఇదేనా ?

పేజ్ ఇండస్ట్రీస్ సంస్థ రద్దయిన స్థానంలోనే రేమండ్స్‌కు కేటాయించే అవకాశాలున్నాయి. ఇటీవలే రేమండ్స్ సంస్థ రాప్తాడులో పరిశ్రమ ఏర్పాటుకు ముందుకొచ్చింది. ఈ మేరకు అనుమతులిస్తూ ఉత్వర్వులిచ్చారు. ఈ సంస్థకు 25 ఎకరాల భూమిని కేటాయించారు. ఏ భూములు అన్నది ఇంకా నిర్ణయించలేదు. ఈ భూములు పేజ్ ఇండస్ట్రీ నుంచి స్వాధీనం చేసుకున్నందున దీన్ని కేటాయించే అవకాశముంది.

ఫిర్యాదు చేశా.. కుట్ర చేయలేదు..!

ఈ స్టాంప్ వ్యవహారంపై టిడిపి నాయకులు మారుతీ చౌదరి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఇ-స్టాంపుల ట్యాంపరింగు విషయం తన దృష్టికి వస్తే రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ఐజి దృష్టికి తీసుకెళ్లాను తప్ప కుట్రదారుడిని కాదు అని టిడిపి నాయకులు మారుతీ చౌదరి తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఇ-స్టాంపుల కుంభకోణం బయటకు రావడంలో మారుతీచౌదరి కుట్రదారుడని డీఎస్పీ కొన్ని మీడియా సంస్థలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారని తెలిపారు. దానిపై వివరణ ఇవ్వడానికే తాను మాట్లాడుతున్నట్టు తెలిపారు. తాను కుట్రదారుడిని కాదని.. ప్రభుత్వ ఆదాయానికి గండిపెడుతున్న విషయం తనకు తెలియగానే రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు. దానిపై విచారణ చేపట్టిన క్రమంలోనే కళ్యాణదుర్గంలో మీసేవా బాబు వ్యవహారం బయటకొచ్చిందన్నారు. ఇందులో ప్రధాన బాధితురాలు ప్రభుత్వమే అన్నారు. మీసేవా బాబు గతంలో వైసిపిలో ఉంటూ మంత్రి ఉషశ్రీచరణ్‌కు ముఖ్య అనుయాయుడిగా ఉండేవాడని చెప్పారు. ఇతను చేసిన మోసం తన దృష్టికి రావడంతో విషయాన్ని ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. తమ పార్టీ ఎమ్మెల్యే అమిలినేనిపై తానెందుకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. వారు కూడా ఇందులో బాధితులుగానే ఉన్నారని వివరనిచ్చారు. మీసేవా బాబు కూడా టిడిపిలో ఉన్నారన్న ప్రశ్నకు ఆయన స్పందిస్తూ పొద్దుతిరుగుడు లాంటి వారు కొందరుంటారని, అందులో మీసేవా బాబు ఒక్కడన్నారు. ఆయన మోసాలకు టిడిపికి సంబంధం లేదని పేర్కొన్నారు.

'కూటమి'తోనే సుపరిపాలన : మంత్రి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి

ప్రజాశక్తి -పెనుకొండ

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రజలలో బలంగా తీసుకెళ్ళాలని మండల,గ్రామ,యూనిట్,క్లస్టర్,బూత్ ఇన్‌ఛార్జిలు,కార్యకర్తల విస్తత స్థాయి సమావేశంలో మంత్రి సవిత దిశానిర్దేశం చేశారు. మంగళవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమం పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఇంటింటికీ తిరిగి ప్రజలందరికీ వివరించాలన్నారు. ప్రజా విశ్వాసాన్ని పెంచుకోవడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం, సీఎం చంద్రబాబు పని చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నరసింహ రావు,మండల పార్టీ అధ్యక్షులు క్లస్టర్ , యూనిట్, బూత్ ఇంచార్జ్ లు టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓబులదేవర చెరువు: రాష్ట్రంలో సుపరిపాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే పల్లె సింధూర పేర్కొన్నారు. మండలంలోని ఐటిఐ కళాశాలలో మంగళవారం పుట్టపర్తి నియోజవర్గ టీడీపీ కన్వీనర్లు ,క్లస్టర్ ,యూనిట్ ఇన్ ఛార్జ్ లు ,గ్రామ కమిటీ ,బూత్ కమిటీ ,సాధికారత కమిటీ సభ్యులు ,అనుబంధ సంఘాల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కూటమి ఏడాది పాలన నేపథ్యంలో బుధవారం నుంచి చేపట్టనున్న ఇంటింటికి కూటమి ప్రభుత్వం అనే కార్యక్రమంపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే పల్లె సింధూర, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఇది మంచి ప్రభుత్వం అని సగౌరవంగా చెప్పుకొనే మంచి రోజులు వచ్చాయని తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ఆమడగూరు మండలం కసముద్రం నుంచి బుధవారం ఇంటింటికి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని కోరారు. అంతకుముందు ఒడి చెరువు మండలంలోని కొండక మార్ల పంచాయతీలోని గంగిరెడ్డిపల్లి బీసీ కాలనీలో ఓడి చెరువు ఎస్సీ కాలనీలో గాజుగుంటపల్లి మిట్టపల్లి పంచాయతీల్లో ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ జయచంద్ర, మాజీ జడ్పిటిసి పిట్టా ఓబుల్ రెడ్డి ,తుమ్మల మహబూబ్ బాషా ,అంజనప్ప ,పీట్ల సుధాకర్ నిజాం ,రాజారెడ్డి, శివారెడ్డి , జాకీర్ , ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమాలన్నీ ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పల్లె సింధూర , మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల కన్వీనర్లు, క్లస్టర్లు, యూనిట్ ఇన్చార్జులు, గ్రామ కమిటీ, బూత్ కమిటీ, సాధికారత కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తో పాటు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, ఈనెల 2న బుధవారం నుంచి ఇంటింటికి కూటమి ప్రభుత్వం అనే కార్యక్రమం లో నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మొదటి రోజు అమడగూరు మండలం కస్ససముద్రం నుంచి ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులపై అలసత్వం తగదు : పీడీ

ప్రజాశక్తి-పెనుకొండ



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ సుదర్శన్

డ్రిప్, స్పింక్లర్ల విషయంలో రైతుల పట్ల అలసత్వం వహించొద్దని ఎపిఎంఐపి పీడీ సుదర్శన్ అన్నారు. మంగళవారం పట్టణంలోని డిహెచ్‌ఓ కార్యాలయంలో ఎంఐ కంపెనీల డీసీఓ డీలర్లకు శిక్షణ, సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రైతులకు అందించాల్సిన డ్రిప్ పరికరాలు, సరఫరా తదితర అంశాలపై చర్చించారు. 2025-26 ఏడాది కి సంబంధించి డ్రిప్, స్పింక్లర్లుకావలసిన రైతుల వివరాలు ఆర్ఎస్‌కెల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. రైతుల నుంచి నాన్ సబ్సిడీ నగదు కేవలం ఫోన్ పే లింక్ ద్వారా మాత్రమే డీడీలు కట్టించాలని సూచించారు. ఎంఐ కంపెనీల డిసిఓలు, డీలర్లు త్వరితగతిన సంబంధించి పనులు పూర్తి చేయాలని, ఎక్కడ అలసత్వం ప్రదర్శించకూడదని హెచ్చరించారు.

పింఛన్ల పంపిణీలో అనధికారుల హవా

ప్రజాశక్తి మడకశిర రూరల్

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో అనధికారుల జోక్యంఎక్కువైంది. కొన్ని వార్డుల్లో, గ్రామాలలో అనధికారిక వ్యక్తులు ఉద్యోగులను పక్కనపెట్టి పింఛన్లను తమ సొంతడబ్బు ఇస్తున్నట్లు పంపిణీ చేయడంలో పలువురు అసహనం వ్యక్తం చేశారు. పింఛన్లు ఇవ్వటానికి ఎటువంటి సంబంధం లేని వ్యక్తులు ప్రతినెల పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొనడంపై లబ్దిదారులు అసంతృప్తి వ్యక్తం అవుతోంది. ఇలా అనధికారిక వ్యక్తులు జోక్యంతో భవిష్యత్తులో పెత్తందారితనం తిరిగి మొదలయ్యే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.



మేస్త్రీ దంపతులను సన్మానిస్తున్న చైర్మన్, తదితరులు

కార్మికుల సేవలు గుర్తించాలి

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణ సుందరీకరణ కోసం పారిశుధ్యకార్మికులు చేస్తున్న సేవలను గుర్తించాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మేస్త్రీ గా బాధ్యతలు నిర్వహిస్తున్న అక్కులప్ప, పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న నరసమ్మల ఉద్యోగ విరమణ సందర్భంగా మంగళవారం పబ్లిక్ హెల్త్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం ఆయా ఉద్యోగుల శేష జీవితం సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సతీష్ కుమార్, ఎమ్‌హెచ్‌ఓ శోభన్ రెడ్డి, శానిటరీ ఇన్స్ పెక్టర్లు శంకర్, నిజాముద్దీన్, టీ.ఓ. ఆనంద రాజు, మునిసిపల్ పబ్లిక్ హెల్త్ వర్కర్స్, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

కొత్తచెరువు రూరల్ : మండల పరిధిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో క్షయ వ్యాధిపై డిటిసి సూపర్‌వైజర్ హబీబ్ భాషా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. క్షయ వ్యాధి పట్ల ఎవరు నిర్లక్ష్యము చేయరాదని, ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించి ప్రజలు ఆరోగ్య వంతమైన జీవనం సాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్యవతి, రంగమ్మ, వైద్య సిబ్బంది సబిహ సంధ్య ఆశ వర్కర్లు లీలావతి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ తిప్పేనాయక్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా డాక్టర్ తిపేంద్ర నాయక్ మంగళవారం బాధ్యతలను చేపట్టారు. గతంలో ఉన్న డాక్టర్ మాధవి ఇదే ప్రభుత్వ ఆసుపత్రిలో సివిల్ సర్జన్ గైనకాలజీ స్పెషలిస్ట్ డాక్టర్‌గా కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులు, కార్యాలయ సిబ్బంది డాక్టర్ తిపేంద్ర నాయక్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా తిప్పేంద్రనాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రిలోని వైద్యులు, సిబ్బంది సహాయ సహకారాలతో ఆసుపత్రికి ఒక మంచి గుర్తింపు తెచ్చేలా కృషి చేస్తానని తెలిపారు.

అండర్ -19 మహిళా క్రికెట్ రాష్ట్ర ప్రాబబుల్స్ జట్టుకు కదిరి క్రీడాకారిణి

ప్రజాశక్తి - కదిరి టౌన్



తేజశ్వని

ఆంధ్ర క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో వైజాగ్‌లో ఈనెల 2 నుండి ప్రారంభమై 12 వరకు జరగనున్న రాష్ట్ర స్థాయి అండర్ 19 మహిళా క్రికెట్ వన్ డే, టి 20 క్రికెట్ పోటీల ప్రాబబుల్స్ జట్టుకు కదిరి క్రీడాకారిణి తేజశ్వని ఎంపిక అయ్యారు. తెజేశ్వని ఇటీవల అండర్ 19 జిల్లా జట్టుకు ఎంపికై నెల్లూరులో జరిగిన అంతర జిల్లాల క్రికెట్ పోటీలలో కుడి చేతి మీడియం పేసర్, ఫీల్డర్ గా ప్రతిభ కనబర్చారు. రాష్ట్ర ప్రాబబుల్స్ జట్టుకు ఎంపికైన తెజేశ్వని సాధన పాఠశాల నందు 8వ తరగతి చదువుతోంది.క్రీడాకారిణిని కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్మిత. పీడీ నరసింహచారి, అధ్యాపకులు అభినందించారు. ఈ పోటీలలో రాణించి మరింత పై స్థాయి క్రికెట్ ఆడాలని కదిరి ఎమ్మెల్యే, కదిరి మండల క్రికెట్ సంఘం అధ్యక్షులు కందికుంట వెంకట ప్రసాద్, ఉపాధ్యక్షులు పవన్ కుమార్ రెడ్డి, హరి ప్రసాద్ రెడ్డి మరియు సభ్యులు, సీనియర్ క్రీడాకారులు ఆకాక్షించారు.

ఆరోపణలపై స్పందించిన కమిషనర్

చైర్మన్ సమక్షంలో రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి-హిందూపురం



ప్రతిపక్ష కౌన్సిలర్లకు రికార్డులు చూపిస్తున్న కమిషనర్

పురపాలక సంఘంలో ఈ మధ్యన రూ.80లక్షలతో చేపట్టిన డీసిల్టేషన్ పనులకు సంబందించి సింగిల్ టెండర్ ఎలా ఆమోదిస్తారని, ఇందులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందంటు వైసిపి కౌన్సిలర్లు సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో కమిషనర్‌తో పాటు అధికారులను నిలదీశారు. దీనిపై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్పందించి మంగళవారం కౌన్సిల్ సమక్షంలో రికార్డులను చూపిస్తామని చెప్పారు. అందులో భాగంగా మంగళవారం కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ సమక్షంలో వైస్ చైర్మన్ జబివుల్లా, వైసిపి కౌన్సిలర్లకు డీసిల్టేషన్ కు సంబందించి జరిగిన టెండర్, ఇప్పటి వరకు జరిగిన పనులు అన్ని వివరాలకు సంబందించిన రికార్డులను చూపించారు. అదే విధంగా పురపాలక సంఘంలో పారిశుధ్య నిర్వహణ నిమిత్తం నాలుగు డివిజన్‌లు ఉన్నాయని, ప్రతి డివిజన్‌కు రూ.20లక్షలు కేటాయించి పనులను చేయడానికి టెండర్ పిలవడం జరిగిందనిమొదటి సారి తక్కువ కోడ్ చేయడంతో టెండర్‌ను తిరస్కరించామని చెప్పారు. రెండవ సారి టెండర్ పిలచి, కౌన్సిల్ అనుమతి మేరకు పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించడం జరిగిందన్నారు. చేస్తున్న పనులను ఎప్పటికప్పుడు పరిశీలన చేయడంతో పాటు జియో ట్యాగ్ చేస్తున్నామన్నారు. ఇక గతంలో కౌన్సిల్ సమావేశం సందర్బంగా వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, వైసిపి కౌన్సిలర్లు ఇచ్చిన డీసెంట్ నోటీసును జిల్లా కలెక్టర్‌కు పంపడం జరిగిందని. నిబంధనల ప్రకారం పనులు చేయిస్తున్నామని వివరించారు. ఇతర పనులకు సైతం నిబంధనలకు లోబడి పనులను అప్పగించడం జరిగిందని వారికి కమిషనర్ చెప్పారు. పురపాలక సంఘంలో జరిగే ఏ అభివృద్ధి పనులకు సంబందించిన రికార్డులైనా కౌన్సిల్ సభ్యులు ఎప్పుడు అడిగినా చూపిస్తామన్నారు. రికార్డులను చూసిన కౌన్సిలర్లు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో టిడిపి కౌన్సిలర్లు రాఘవేంద్ర, సతీష్ కుమార్, గిరీష్ కుమార్, బిజెపి కౌన్సిలర్ అంజలి, వైసిపి కౌన్సిలర్లు ఆసీఫ్, శివ, నాగేంద్ర కుమార్, ఎంఈ దస్తగిరి, ఏఈలు జనార్ధన, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు

బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



మహిళకు పింఛను అందజేస్తున్న మంత్రి సవిత



వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర



వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న ఎమ్మెల్యే కందికుంట

ప్రజాశక్తి-పెనుకొండ

ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా రాజకీయాలకతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు చేరవేస్తున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టంచేశారు. మంగళవారం మండలంలోని వెంకటగిరి పాళ్యంలో మంత్రి సవిత ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ,ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేశారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పెన్షన్లను అందజేశారు. అంతకుముందు గ్రామంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీనీ సీఎం చంద్రబాబునాయుడు నెరవేరుస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ వర్తంప చేస్తున్నామని చెప్పారు. త్వరలోనే ఇళ్లు అంజేయనున్నామని, అర్హులు వైసీపీలో ఉంటే వారి సొంతిళ్లు కల నెరవేరుస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఆనంద్ కుమార్, ఎంపీడీవో నరేష్‌కృష్ణ, తహశీల్దార్ స్వాతి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, నాయకులు వడ్డే శ్రీనివాసులు, మండలకన్వీనర్ ఈశ్వర ప్రసాద్, తుపాకుల రవి, వడ్డే వెంకటేష్, లక్ష్మీ నారాయణరెడ్డి, సూర్య నారాయణరెడ్డి, పోతిరెడ్డి, బాబుల్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన మంత్రి

పెనుకొండ మండలం వెంకటగిరిపాళ్యం లో ప్రాథమిక పాఠశాలను మంత్రి సవిత మంగళవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలసి మధ్యాహ్నం భోజనం చేశారు.ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కొత్తచెరువు రూరల్ : నెల నెల సామాజిక భద్రత పెన్షన్లు లబ్ధిదారులకు సక్రమంగా అందజేయాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ అధికారులకు సూచించారు. ఈ మేరకు ఆయన మంగళవారం కొత్తచెరువు మండల పరిధిలోని తలమర్ల గ్రామంలో జరిగిన సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఇల్ల వద్దకు వెళ్లి పింఛను మొత్తాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

.మడకశిర రూరల్ : మడకశిర మున్సిపల్ పరిధిలోని మాలేరోపం గ్రామంలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తిప్పేస్వామి, మడకశిర మునిసిపల్ చైర్ పర్సన్ వెంకట లక్ష్మమ్మ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాగరాజు, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మడకశిర :పట్టణంలోని మాళేరొప్పంలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, నాయకులు తిమ్మరాజు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

బుక్కపట్నం. : మండల కేంద్రంలో లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ కార్యక్రమంలో మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మల్లిరెడ్డి, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, నాయకులు గంగాధర్, వెంకట రాముడు, సాకే యశోద, చెన్న కష్ణ, లావణ్య గౌడ్ పాల్గొన్నారు.

కొత్తచెరువు. : మండలంలోని కొడవ గాని పల్లి, మైలేపల్లి , కొత్తచెరువు పాత తహశీల్దార్ కార్యాలయం వీధి తదితర ప్రాంతాల్లో లబ్ధిదారులకు మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పింఛన్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ : మండలంలోలోని కొత్తపల్లి తండాలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే పల్లె సింధూర పింఛన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మైలే శంకర,తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మండల పరిధిలోని ఉబిచర్ల గ్రామపంచాయతీలో లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రాజశేఖర్ బాబు, సీనియర్ నాయకులు నర్సారెడ్డి, వైస్ ఎంపీపీ నారాయణస్వామి. ప్రత్యేక అధికారి సూర్యనారాయణ.తహశీల్దార్ రవికుమార్. ఎంపీడీవో రఘునాథ్ గుప్తా. తదితరులతో టిడిపి నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విషపునీరు తాగి 11 గొర్రెలు మృతి

ప్రజాశక్తి - తాడిమర్రి

మండల పరిధిలోని పూలఓబాయపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరులకు చెందిన గొర్రెలు విషపునీరు తాగి మృతిచెందాయి. గ్రామానికి చెందిన జానకొండ సురేష్, ఆకులేటి ముత్యాలప్ప, గుండ్లమడుగు సూరికి సంబంధించిన గొర్రెలు మంగళవారం మధ్యాహ్నం సమయంలో నీరు తాగడానికి సమీపంలోని తోటలోకి వెళ్లాయి. అయితే తోట యజమాని తాను సాగు చేసిన పంటకు డ్రిప్ మందును నీటితొట్టెలో కలిపాడు. అది గమనించని గొర్రెల కాపరులు తమ గొర్రెలను నీటితొట్టె వద్దకు తీసుకెళ్లారు. ఆ నీటికి గొర్రెలు తాగాయి. ఆ నీటికి తాగిన వెంటనే అక్కడికక్కడే ఏడు గొర్రెలు మీతిచెందాయి. మరికొద్దిసేపటికి మరో నాలుగు గొర్రెలు మృతిచెందాయి. మిగిలిన గొర్రెల పరిస్థితి కూడా విషమంగా ఉందని వెటర్నటి డాక్టర్ యూనస్ తెలిపారు. మృతిచెందిన గొర్రెల, పొట్టేళ్ల విలువ ఒక్కొక్కటి రూ. 20 వేల నుంచి 25 వేల రూపాయల వరకు ఉంటుంది. బాధిత గొర్రెల కాపరులను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. గొర్రెల మృతి సమాచారం తెలుసుకున్న కురుబసంఘం జిల్లా అధ్యక్షుడు గొట్లూరు అనిల్, ఉపాధ్యక్షుడు బ్యాల్లా పార్థసారథి ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి గొంగటి రమేష్ తదితరులు బాధిత గొర్రెల కాపరులను పరామర్శించారు. కురుబ సంఘం తరపున బాధిత గొర్రెల కాపరులను ఆదుకుంటామని తెలిపారు.

పాఠశాల వాహనాలు సరిగా ఉండాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ప్రతి ప్రయివేటు పాఠశాల, కళాశాలల బస్సులు పూర్తిగా కండిషన్ గా ఉండాలని మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ రాణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రైవేట్ పాఠశాల, కళాశాల యాజమాన్యంతో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా రాణి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జూన్ 23వ తేదీ నుండి ప్రతిరోజు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 9 కేసులతోపాటు జరిమానా కూడా విధించడం జరిగిందని తెలిపారు. ప్రతి బస్సుకు టాక్స్, ఎఫ్‌సి, పర్మిట్, పొల్యూషన్, డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి ఉండాలని తెలిపారు. బస్సు సీటింగ్ కెపాసిటీని బట్టి విద్యార్థులను ఎక్కించుకోవాలని తెలిపారు. అపరిమితంగా విద్యార్థులను బస్సులో ఎక్కించుకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బస్సులో తప్పనిసరిగా విద్యార్థి విద్యార్థులను ఎక్కించుకునేందుకు ఒక అటెండర్ కూడా ఉండాలని తెలిపారు. రోజువారి తనిఖీలు తప్పనిసరి ఉంటాయని, పాఠశాల, కళాశాల, యాజమాన్యం వారు గమనించి సహకరించాలని తెలిపారు.

రిటైర్డ్ తహాశీల్దార్‌కు సన్మానం

ప్రజాశక్తి - మడకశిర

మడకశిర తహాశీల్దార్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన కరుణాకర్‌ను మంగళవారం ఘనంగా సన్మానించారు. స్థానిక తహాశీల్దార్ కార్యాలయ ఆవరణములో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ కరుణాకర్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహాశీల్దార్ లక్ష్మీ నరసింహ, ఆర్ఐ సోమశేఖర్, వీఆర్వోలు, డీలర్లు, రెవెన్యూ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - మడకశిర

మండలంలోని కదిరేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న ఈ రామగిరి, ఆమదాల గొంది, సచివాలయ పరిధిలో ఖాళీగా ఉన్న ఆశావర్కర్ పోస్టుల భర్తీకి అర్హత, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని కదిరేపల్లి డాక్టర్ నరేష్ కుమార్ తెలిపారు. ఈనెల నాలుగో తేదీ లోపల దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి - మడకశిర రూరల్

మండల పరిధిలోని బుడ్డయ్యపాలెం గ్రామానికి చెందిన వెంకటేష్ ఇటీవల జరిగిన ప్రమాదంలో మృతిచెందాడు. వెంకటేష్ తెలుగుదేశం పార్టీ సభ్యత్వం పొంది పార్టీ ద్వారాప్రమాద బీమా చేయించుకున్నారు. దీంతో వారికి రావలసిన ప్రమాద బీమా మొత్తాన్ని చెక్కు రూపంలో మంగళవారం మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు తిప్పేస్వామి, శ్రీనివాసమూర్తి, వైబిహల్లి సర్పంచి రామాంజనేయులు, లక్ష్మీనారాయణ, ప్రసాద్, రంగనాథ, గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యానికి భద్రత

ప్రజాశక్తి - బత్తలపల్లి

ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారని బత్తలపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అరుణ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జాతీయ డెంగీ మాసోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బందితో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది ప్రతి శుక్రవారం ఖచ్చితంగా ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలని, లార్వా సర్వే, జ్వర సర్వే నిర్వహించాలని చెప్పారు. డెంగీ గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రజలు కూడా ప్రతి ఒక్కరూ వారానికి ఒక్కసారి నీరు నిలువ ఉంచుకున్న తొట్టెలను, డ్రమ్ములను శుభ్రపరిచుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ రాజశేఖర్, సూపర్‌వైజర్ అశ్వర్థనారాయణ, గౌరమ్మ, ఫార్మసీ ఆఫీసర్ సరస్వతమ్మ. ల్యాబ్ టెక్నీషియన్ రాఘవేంద్ర. ఆరోగ్య కార్యకర్తలు డేవిడ్, మారుతి, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్స్, ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ వైద్యుల దినోత్సవం

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం కాకతీయ విద్యానికేతన్‌లో మంగళవారం జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ నిర్మలాదేవి మాట్లాడుతూ జాతీయ వైద్యుల దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. ఈ సందర్భంగా ప్రముఖ స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ పద్మను సన్మానించారు. పాఠశాల డైరెక్టర్ శెట్టిపి సూర్య ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ఉన్నతమైన సేవలు అందిస్తున్న వైద్యులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు సూర్య ప్రకాశ్ రెడ్డి పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెనుకొండ:డాక్టర్స్ డే సందర్భంగా బహుజన చైతన్య వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు శివరామకృష్ణ నేతృత్వంలో పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహించే వైద్యులను మంగళవారం సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో వైద్యవృత్తి ఎంతో విలువైనదని వైద్యులు ప్రాణదాతలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ శివ ప్రసాద్ నాయక్, డాక్టర్ భాస్కర్ రెడ్డి, డాక్టర్ తేజ, డాక్టర్ అయేషా, డాక్టర్ రాజా శేఖర్, బహుజన చైతన్య వేదిక నాయకులు రొద్దం బాబు ప్రసాద్, రవికుమార్, క్రిష్టఫర్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి : ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తూ గ్రామీణ ప్రాంతాల నుండి మండల కేంద్రానికి అనారోగ్య కారణాలతో వైద్యం కోసం వచ్చే నిరుపేదలకు సేవలు అందిస్తున్న డాక్టర్ల సేవలు ఎందరికో ఆదర్శప్రాయమనిప్రవీణ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం డాక్టర్స్ డే సందర్భంగా పరిగి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్స్ గా విధుల్లో ఉన్న స్వరూప రెడ్డిని సన్మానించారు.

ధర్మవరం రూరల్ : ధర్మవరం పట్టణంలోని రిషి విద్యాలయంలో మంగళవారం డాక్టర్స్ డే వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ ఆది శేషును పాఠశాల డీన్ ఆఫ్ అకాడమిక్స్ కిరణ్ స్వరూప సింగ్, డీన్ భాస్కర్ రెడ్డి, ఏవో రవీంద్ర తదితరులు సన్మానించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పట్టణంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు వెళ్లి వైద్యులకు పూల మొక్కలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తనకల్లు : మండల కేంద్రంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు సోంపాలెం నాగభూషణ ఆధ్వర్యంలో వైద్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ విజయ్ కుమార్, వైద్యులు భాస్కర్ నాయక్ రమేష్ బాబు, షాదియా, సులోచన, ధర్మరాజు, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి రొద్దం

మండలంలోని ఆర్. లోచర్ల గ్రామంలో మంగళవారం వ్యవసాయ అధికారులు పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో రాజేష్ మాట్లాడుతూ ప్రస్తుతం పంటల సాగు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అదే విదంగా అన్నదాత సుఖీభవ పెండింగ్ జాబితా చదివి వినిపించారు.వీరు తప్పకుండ ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో హంస వేణి, ఆర్.బి.కె సిబ్బంది జాఫర్ వలి, ఇన్సూరెన్స్ సిబ్బంది, లోచర్ల పంచాయతీ తెలుగుదేశం పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - కదిరి అర్బన్

బాధితులకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రోడ్డు భవనాల అతిథిగృహంలో లబ్ధిదారులకు మంగళవారం పంపిణీ చేశారు. 16 మంది లబ్ధిదారులకు వీటిని పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలుండి ఆర్థిక స్థోమత లేక ఇబ్బందులు పడుతున్న వారిని ఆదుకునేకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరమన్నారు.

కదిరి టౌన్ : అనారోగ్యంతో బాధపడుతూ కష్టాల్లో ఉన్నవారికి సిఎం సహాయనిధి కొండంత భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రోడ్లు భవనాల అతిథిగృహంలో 16మంది లబ్ధిదారులకు రూ.11.78 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.

4న జాబ్ మేళా

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని ఎన్ఎస్‌పిఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 4 వ తేదీన జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ తెలిపారు. మంగళవారం కళాశాలలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హత కలిగిన యువతీ,యువకులు ముందుగానే రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. దాదాపు 15 కంపెనీలకు సంబంధించిన హెచ్‌ఆర్‌లు జాబ్‌మేళాలో పాల్గొనిఅర్హులైన యువతీ, యువకులను ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని ఎన్.ఎస్.పి.ఆర్. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యం.ప్రగతి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ వెంకటేశులు, కౌన్సిలర్ సతీష్, కళాశాల ప్లేస్ మెంట్ అధికారి డాక్టర్ రవి నాయక్, అధ్యాపకులు ఎల్.ఆర్.రమేష్, పార్వతి, ప్రకాష్ రావు, అశ్వర్థప్ప, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

3న ప్రయివేటు విద్యా సంస్థలు బంద్

ప్రజాశక్తి-హిందూపురం

ప్రయివేటు స్కూల్స్ అసోసియేషన్ పిలుపు మేరకు ఈ నెల 3వ తేదీన గురువారం రాష్ట్రవ్యాప్తంగా ప్రయివేటు విద్యా సంస్థలకు బంద్ ప్రకటించినట్లు అసోసియేషన్ నాయకులు మంగళవారం తెలిపారు. పాఠశాలలను శాంతియుత వాతావరణంలో నడుపుతున్న తమపై రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలలో విద్యాశాఖ అధికారులు కొంత మంది తనకీల పేరుతో వేధిస్తున్నారని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా విద్యా హక్కు చట్టం అనుసరించి ప్రైవేట్ విద్యా సంస్థల్లో విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వడం జరిగిందని. అయితే ఆ విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సిన డబ్బులు ఇంతవరకు చెల్లించలేదని అన్నారు. అయినప్పటికి విద్యా హక్కు చట్టం అనుసరించి అడ్మిషన్లు చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు ఒత్తిడి తెస్తున్నారన్నారు. వీటితో పాటు ప్రవేట్ విద్యాసంస్థల నిర్వహకులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు బంద్ పాటిస్తున్నట్లు వారు వివరించారు. బంద్‌కు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని అపుస్మ రాష్ట్ర కోఆర్డినేటర్ పుల్లారెడ్డి కోరారు.

పౌష్టికాహారం అందేలా చర్యలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టిన ప్రతి బిడ్డకు, తల్లికి సకాలంలో పౌష్టిక ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని పుట్టపర్తి ఎంపీపీ ఎవి రమణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం లో పుట్టపర్తి ప్రాజెక్ట్ ఐసిడిఎస్ సిడిపి జయంతి ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తల ప్రాజెక్ట్ స్థాయి సమావేశం నిర్వహించారు ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా హాజరైన ఎంపిపి రమణారెడ్డి, ఎంపిడిఒ నాగేశ్వరరావు మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు గ్రామంలో తల్లీబిడ్డలను పర్యవేక్షించి పోషకాహారలోపం లేకుండా చూడాలన్నారు. అనిమియా , బాల్యవివాహాలు, లైంగిక నేరాలు లాంటివి లేకుండా చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో పుట్టపర్తి సూపరవైజర్ సుజాత, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల సూపరవైజర్లు పుష్పావతి, రజిత, భారతి, ప్రాజెక్టు స్థాయి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బంగారు కృష్ణమూర్తికి శుభాకాంక్షల వెల్లువ

ప్రజాశక్తి కదిరి టౌన్



కృష్ణమూర్తికి శుభాకాంక్షలు చెబుతున్న శ్రేయోభిలాషులు

రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం ఒక్కటోవ వార్షికోత్సవం, ఆసంఘం రాష్ట్ర అధ్యక్షులు బంగారు క్రిష్ణమూర్తి పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. పట్టణంలోని రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు బంగారు క్రిష్ణమూర్తి స్వగృహంలో పలువురు నాయకులు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భ:గా ఆయన మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టి జాబితాలో చేర్చాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు కి ,ఎమ్మెల్యేలు, కలెక్టర్లకు, తహశీల్దార్లకు పోస్ట్ కార్డు ద్వారా వినతి పత్రాలు అందజేశామన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర వాల్మీకి సేవ సంఘం ఆధ్వర్యంలో వాల్మీకి సంఘం కోసం ఉద్యమాలలో చురుగ్గా పాల్గొన్న ఆర్ వి ఎస్ ఎస్ నాయకులకు పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాల్మీకి సేవా సంఘం నాయకులు ఆనంద్,శ్రావణ్, శివప్రసాద్, నరసింహులు, అంజనా దేవి,మోహన్,కేశవ,ప్రమీల, పరుశురాం, సురేష్, వెంకటస్వామి, అశోక్, నాగవేణి, జయశంకర్,రమణ, వీర నారప్ప, ఆర్ వి ఎస్ ఎస్ రాష్ట్ర మరియు జిల్లా మరియు నియోజకవర్గ మరియు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు

రిటైర్డ్ టీచర్‌కు సన్మానం

ప్రజాశక్తి - కదిరి టౌన్

యుటిఎఫ్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చారని ఎక్కడ పనిచేసిన తన విధి నిర్వహణలో ప్రత్యేకత చాటుకున్నారని యుటిఎఫ్ నాయకులు అన్నారు. మడకశిర మండలం మణురు మోడల్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గా పనిచేస్తున్న శ్రీనివాసులు ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా మంగళవారం పట్టణంలోనీ ఎన్జీవో హెూం నందు యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి వై వి సుబ్బారెడ్డి అధ్యక్షతన సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లా కార్యదర్శి గా, జిల్లా ఉపాధ్యక్షులుగా సుదీర్ఘ సేవలు అందించిన శ్రీనివాసులు పనితీరు ఆదర్శనీయమన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, కార్యదర్శి తాహిర్ వలి , అమడగూరు , రెడ్డిపల్లి , సోమగట్ట ,రెక్కమను ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు రమణ రెడ్డి, జంషిద్, శంకర్ రెడ్డి , ఖాదర్ వలి, సీనియర్ నాయకులు ఆనంద్ , హనీఫ్ , యూటీఎఫ్ జిల్లా నాయకులు మల్లికార్జున, అజమ్, సునిల్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీనివాసులును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అక్రమ ఇసుక రవాణాపై జనాగ్రహం

- నిదనవాడ పెన్నానది వద్ద గ్రామస్తుల ఆందోళన
- టిప్పర్లు, జెసిబిల అడ్డగింత... అక్కడే వంటావార్పు
- ఇసుక తరలిస్తే ప్రత్యక్షదాడులకైనా సిద్ధం
- అధికారుల హామీతో శాంతించిన గ్రామస్తులు

ప్రజాశక్తి-శింగనమల

పెన్నానది నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న వారిపై గ్రామస్తుల ప్రజాగ్రహం వ్యక్తం అయ్యింది. గత కొన్ని రోజులుగా శింగనమల మండలం నిదనవాడ గ్రామం పెన్నానది పరీవాహక ప్రాంతం నుంచి కొందరు పెద్ద ఎత్తున టిప్పర్లు, జెసిబిలు, హిటాచీలు ఏర్పాటు చేసి ఇసుకను తరలించుకుపోతున్నారు. ఈ నేపథ్యంలో పలుమార్లు గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వందలాది టిప్పర్లతో ఇసుక తరలిపోతుంటే భూగర్భ జలాలు అడుగంటిపోయి తాము పూర్తిగా నష్టపోతామని పేర్కొన్నారు. అయినా ఇసుక తరలింపు ఆగలేదు.

పెల్లుబికిన ఆగ్రహం

ఇసుక తరలింపును ఆపాలనే పదేపదే గ్రామస్తులు కోరినా ఆగలేదు. దీంతో గ్రామస్తుల ఆగ్రహం కట్టలుతెచ్చుకుంది. మంగళవారం ఉదయం గ్రామస్తులు అందరూ ఏకం అయ్యి పెద్ద ఎత్తున పెన్నానది పరీవాహక ప్రాంతం వద్దకు వెళ్లారు. ఇసుక తరలింపు ఆపాలంటూ అక్కడున్న వారికి చెప్పారు. అయినా తరలింపుదారులు వినకుండా ఇసుకను తీసుకెళ్లేందుకు సిద్ధం అయ్యారు. దీంతో గ్రామస్తులు దారికి అడ్డంగా నిల్చొని వాహనాలు ముందుకు వెళ్లకుండా అడ్డుకున్నారు. దాదాపు మధ్యాహ్నం వరకు గ్రామస్తులంతా ఏకమై అక్కడే బైటాయించారు. పెన్నానది పరీవాహక ప్రాంతం వద్దనే వంటావార్పు చేపట్టారు. మధ్యాహ్నం వరకు గ్రామస్తులు అంతా అక్కడే ఉండి ఆందోళన కొనసాగించారు.

పోలీసుల నచ్చజెప్పే ప్రయత్నం

నిదనవాడ గ్రామస్తుల ఆందోళన విషయం తెలుసుకున్న పోలీసులు పెద్ద సంఖ్యలో పెన్నా నది పరీవాహక ప్రాంతం వద్దకు చేరుకున్నారు. సిఐ కౌలుట్లయ్య, ఎస్ఐ విజయకుమార్, తహశీల్దార్ శేషారెడ్డి ఆధ్వర్యంలో అక్కడికి చేరుకుని గ్రామస్తులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో గ్రామస్తులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇసుక తరలింపును అడ్డుకోవాలంటూ తాము ఎన్నిసార్లు చెప్పినా ఎందుకు పట్టించుకోవడం లేదంటూ నిలదీశారు. ఈ సమయంలో సిఐ, తహశీల్దార్ స్పందిస్తూ ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలించే వాహనాలను సీజ్ చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు శాంతించారు.

పంటలన్నీ ఎండిపోతున్నాయి
నిదనవాడ గ్రామస్తులు.

నిత్యం వందలాది టిప్పర్లతో ఇసుకను తరలించుకుపోతుంటే తమ గ్రామంలో భూగర్భ జలాలు అడుగుంటిపోతున్నాయని నిదనవాడ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. బోర్లలో నీళ్లులేక దానిమ్మ, చీనీ, మామిడి తదితర తోటలన్నీ ఎండిపోతున్నాయన్నారు. ఇలాగే ఇసుక తరలింపు జరిగితే కనీసం తాగేందుకు కూడా తమ గ్రామంలో నీళ్లు రావన్నారు. పంటలు లేకపోతే తమకు ఆత్మహత్యలే శరణ్యం అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక తరలింపును ఆపించాలని, లేకుంటే తామే ప్రత్యక్షంగా అడ్డుకుంటామని తెలియజేశారు.

అక్రమంగా ఇసుకను ఉపేక్షించం
ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

శింగనమల నియోజకవర్గంలోని పెన్నా నది పరీవాహక ప్రాంతంలో అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ తెలియజేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా పెన్నా నుంచి తాడపత్రి వాసులు అక్రమంగా ఇసుకను యంత్రాలు ద్వారా తవ్వుతున్నారని నిదనవాడ గ్రామ రైతులు ఎమ్మెల్యేకి తెలియజేశారు. వెంటనే ఎమ్మెల్యే రెవెన్యూ, పోలీస్ అధికారులతో మాట్లాడి ఇసుక తరలింపు దారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గంలో అక్రమంగా ఇసుకను తరలిస్తుంటే ఎక్కడికక్కడ అడ్డుకోవాలని కూటమి నాయకులకు ఆమె పిలుపునిచ్చారు.



నిదనవాడ గ్రామం పెన్నానది పరీవాహక ప్రాంతం వద్ద టిప్పర్లను అడ్డుకుని, అక్కడే వంటా వార్పు చేస్తూ నిరసన తెలుపుతున్న గ్రామస్తులు



పోలీసులు, అధికారులను నిలదీస్తున్న నిదనవాడ గ్రామస్తులు